కథా నిలయం
3760
శ్రీకాకుళం

# గాంధీని చూసినవాడు

అన్నా చెల్లెళ్లిద్దరూ చాలాసేపు చిత్రిత మల్లా అలాగే నిలబడిపోయి ఇహ అప్పుడు కదిలి ఇంటిముఖం పట్టారు.

'అబ్బా, దారుణం!' అన్నది చెల్లెలు. పధ్నాలుగు, లేక పదిహేనేళ్ల పడుచుపిల్ల లత... హేమలత.

'నిజమే, దారుణమే!' అన్నాడు అన్న పద్ధెనిమిదీ పంతొమ్మిదేళ్ల వందమీటర్ల స్ప్రింటర్‌లాంటి రాజశేఖరం.

ఊరికి దూరంగా కొండ ఇటీవల కురిసిన వర్షాలకు శుభ్రంగా పచ్చగా మెరుస్తున్నది. సూర్యుడు మెత్తగా వెలుగుతూ పలుచని ఎండను ప్రసరింపజేస్తున్నాడు. మరోవైపు కనుచూపుమేర పచ్చని పొలాలు. మోకాలి ఎత్తున పెరిగి కన్నులపండుగ చేస్తున్న పైరు! నిద్రగన్నేరు చెట్లు పెద్దపెద్ద గొడుగుల్లాగా పెరిగి మృదువైన పూలతో నేలతల్లిని పూజిస్తున్నాయి. చల్లగా పెరిగిన కానుగ, సీమచింత, బాదం, గంగరావి చెట్లతో ఆ పల్లెసీమ అంతా పచ్చపచ్చగా హాయిగా ఉంది. ఊళ్లోకి వస్తే సరి, వారం రోజుల్లో జరగబోయే అసెంబ్లీ ఉప ఎన్నిక తాలూకు కోలాహలం. కాగితపు తోరణాలు, బానర్లు, పోస్టర్లు వాదోపవాదాలతో అంతా సంరంభంగా రణరంగంలాగున్నది.

'దారుణం !' అన్నది మళ్లీ అమ్మాయి. ఈసారి అన్నయ్యా ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా అడుగులు వేస్తున్నాడు.

వీధి మలుపులో ఒకాయన ఎదురై వీళ్లిద్దరినీ చూసి ఆగి, 'మీరేనా ఆఫ్రికానుంచి వచ్చారుట ?' అని పలకరించాడు.

అన్నా చెల్లెళ్లిద్దరూ ఆగారు.

'అవును' అన్నాడు రాజశేఖరం.

ఆంధ్ర...



'ఆఫ్రికాలో ఎక్కడి నుంచి?'

'బోట్స్వానా.'

'దయానిధిగారేమవుతారు మీకు ?'

'ఆయన మా తాతగారు. మా అమ్మగారి ఫాదర్!'

'వెరీగుడ్!' అన్నాడాయన. మధ్య వయసువాడు. పలుచని కళ్లజోడులో నుంచి కళ్లు మెరుస్తూ ఉంటాయి. ఉండి ఉండి కళ్లజోడు సర్దుకుంటున్నాడు.

'మీ తాతగారు గొప్పమనిషి. గొప్ప ఫ్రీడం ఫైటర్. ఈ ప్రాంతంలో ఆయనకెదురు లేదు. ఆయన పగలంటే పగలు, రాత్రి అంటే రాత్రి! ఎవరికేమి కావలసినా ఆయనే అందరికీ పెద్ద దిక్కు. గాంధీగారిని సాక్షాత్తూ చూసి తాకిన అదృష్టవంతుడు. చుట్టుపక్కల పది ఊళ్లల్లో ఆయన మాటే వేదం!'

హేమలత ఉన్నట్టుండి ఆయన వాక్ప్రవాహానికి అడ్డుపడింది. 'అక్కడ ఒక విగ్రహం చూశామిప్పుడే మేము. గాంధీగారిదేగా అది?'

ఆయన ఆ ప్రశ్న విని, వింతగా చూస్తూ, 'ఆ అనుమానం ఎందుకొచ్చింది మీకు? అది నిక్షేపంగా గాంధీగారిదే! కాకపోతే, కాలూ చెయ్యీ విరిగి చేతిలో కర్ర పడిపోయి, తలమీద అడ్డమైన పక్షులూ రెట్టలు వేసి ఆలనా పాలనా లేక అలా తయారైంది!' అన్నాడు.

ఆ తర్వాత నడుస్తూనే, 'మనవాళ్లకు విగ్రహాలు పెట్టడం మీద ఉన్న శ్రద్ధ వాటి మెయింటెనెన్స్ మీద ఉండదు. ఇక్కడే కాదు, ఎక్కడైనా అంతే! మనబోటివాళ్లం బాధపడటం తప్ప ఏమీ చెయ్యలేము. పైగా ఇది గాంధీగారి సంగతి... ఎవడికి పట్టింది? ఎవరి కులం వారి విగ్రహాలు వారు, ఎవరి పార్టీ నాయకుల విగ్రహాలు ఆ పార్టీవారు, ఏ మూల పడితే ఆ మూల పెట్టేసుకుంటున్నారు. వారికి వాటిమీద ఉన్న శ్రద్ధ గాంధీగారి బొమ్మమీద ఉండదు కదా? వారి విగ్రహాలు మాత్రం రంగుల హంగులతో మెరిసిపోతూ ఉంటాయి. వారి వర్ధంతులకు, జయంతులకు ఈ జనం గొప్ప హడావుడి చేస్తూ ఉంటారు. ఒకప్పుడు చదువుకునే రోజుల్లో నేను అప్పటి వాళ్లందరిలాగే మన సమాజంలో కులమత భేదాలు సమసిపోయి గాంధీ మార్క్సులు చెప్పిన సమాజం వస్తుందని అనుకున్నాను. కానీ జరిగింది, జరుగుతున్నదీ వేరు. ఇవాళ కళ్లముందు అంతా చీలికలు వాలికలై అనేక విధాలుగా ముఠాలుగా ముక్కలైపోతున్న సమాజాన్ని చూస్తున్నాను!' అని ఆగి, 'ఏమిటో మాటాడేస్తున్నాను నేను అనవసరంగా. అన్నట్టు.... నేను పరిషత్ హైస్కూల్లో డ్రాయింగ్ టీచర్ను. మీరు ఎన్నాళ్లుంటారిక్కడ?' అని అడిగాడు.

'మరో వారం!'

'మీరు వెళ్లేలోపుగాగానీ, వెళ్లేటప్పుడు కానీ నేను మీకు గాంధీ బొమ్మనొకదాన్ని గీసి ఇస్తాను. మీ దేశానికి తీసుకుపోదురుగాని!'

హేమలత ఆనందించింది. రాజశేఖరం నవ్వుతూ, 'థాంక్స్, సార్!' అన్నాడు.

అన్నా చెల్లెళ్లిద్దరూ ఆ పెద్ద లోగిలి ముందుకు వచ్చేసరికి చీకటి పడుతున్నది.

ముందు విశాలమైన వరండా. అటూ ఇటూ ఆవరణలో రకరకాల పూలమొక్కలు, గోడవారగా కొబ్బరి చెట్లు, ఎత్తుగా మెట్లు. వరండాలో ఒక పక్కన చిన్నసైజు సమావేశం

జరుగుతున్నది. ఒకేరంగు చొక్కాల వాళ్లు కూర్చుని సమాలోచనలు చేస్తున్నారు. దయానిధిగారు అంతవరకు అక్కడే ఉండి ఇప్పుడు లోపలికి వెళ్లినట్టున్నాడు. ఇక్కడ వీళ్లు సిగరెట్లు ఊదేస్తూ కాళ్లు బారజాపుకుని కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వీళ్లిద్దరినీ చూసి అక్కడి వారిలో ఒకాయన పెద్దగా 'ఒరే, అబ్బాయా ! నీ పేరేంది ?' అని అరిచాడు.

'రాజశేఖరం!' అన్నాడు అబ్బాయి దగ్గరగా వెళ్లి నిలబడి.

'రాజశేకరమా !'

'శేకరం కాదు, శేఖరం !'

'షేకరమా !'

'షేకరం కాదు, శేఖరం!'

అవతలి వ్యక్తికి విసుగొచ్చి 'ఏదో ఒకటిలే, మీ దేశం బాగుంటుందా ? మనదేశం బాగుంటుందా ?' అన్నాడు.

'రెండూ బాగుంటాయి.' అన్నాడు రాజశేఖరం.

'మీ బాస బాగుంటుందా ? మన తెలుగు బాస బాగుంటుందా ?'

అన్నాడాయన మళ్లీ.

'రెండూ బాగుంటాయి !' అన్నాడు మళ్లీ రాజశేఖరం.

అంతలో దయానిధిగారు వచ్చి, 'ఏం పిల్లలూ ! ఇంత ఆలస్యమైందే ?' అని అడిగారు.

ఆరడగుల పచ్చని మనిషి...గుండ్రని ముఖం, తెల్లగా మెరిసే మీసాలు. నిరంతరం పాలు, పెరుగు, వెన్న, నెయ్యి సేవనంతో నిగనిగలాడుతున్నాడు. వెంట్రుకలు అక్కడక్కడా తెల్లబడినా అదీ తిలతండులాల కలయికలాగా అందంగానే ఉంది. వృద్ధాప్యం మీద పడినా ముడతలు లేని శరీరం !

'మాటినీ సినిమాకు వెళ్లాం !' అన్నది హేమలత.

'ఎట్లా ఉందేమిటి సినిమా ?' అన్నాడు ముసలాయన.

'ఎట్లా ఉందని చెప్పమంటావు ? అంతా కొట్లాటలు, కాల్పులు, హత్యలు, బాంబులు'! అన్నది హేమలత.

'అంతేనా ? వెర్రిపాటలు, బూతులూ కూడా !' అని వంత పాడాడు రాజశేఖరం.

ముసలాయన నవ్వుతూ,

'మరేంటనుకున్నారు ? దేశం మారిపోవడంలేదూ రోజు రోజుకీ !' అంటూ వరండాలోకి వెళ్లాడు. చేతిలో నోట్ల కట్టలున్నాయి.

కొద్దిసేపటి సమాలోచనల తర్వాత వాళ్లందరూ వెళ్లిపోయారు. ఇంటినిండా, వరండాలోనూ లైట్లు వెలిగాయి. లోపల అమ్మాయిలు టీ.వీ.ఆన్ చేశారు. పెద్దగా డ్యాయిలాగులు వినిపిస్తున్నాయి. అప్పుడొకరూ అప్పుడొకరూ వస్తున్నారు. ముసలాయనతో మాట్లాడిపోతున్నారు.

వరండాలో ఒకపక్క గోడలో గాజుకేసు, అందులో ఒక చెప్పు ! అది గాంధీగారిది. గాంధీగారు అప్పుడెప్పుడో ఆంధ్రదేశం వచ్చినప్పుడు దయానిధిగారు అందరితోపాటు తాను కూడా ఆయనను చూసేందుకు రైలు స్టేషనుకు వెళ్లాడు. అందరికన్నా ముందుగా నిలబడి గుంపుకు నమస్కరిస్తున్న గాంధీగారిని తదేకంగా చూశాడు. రైలు కదలగానే వెనుదిరిగిన గాంధీగారి చెప్పు ఒకటి జారిపడితే దాన్ని ఈయన అందుకున్నాడు. దాన్ని అప్పటినుంచి భద్రంగా దాచి ఉంచాడు. ఆ ఊరు వచ్చినవారు ఎవరైనా, ఏ ఇంటికి చుట్టపు చూపుగా వచ్చినా గాంధీగారిని చూసినవాడనీ, స్వాతంత్ర్య సమరయోధుడనీ దయానిధిగారిని దర్శించేందుకు వస్తారు. అప్పుడా చెప్పును కూడా చూసి వెళ్తూవుంటారు. కొందరు అమిత భక్తితో ఆ చెప్పుకు నమస్కరిస్తూ ఉంటారు కూడా.

బోట్స్వానా పిల్లలిద్దరూ మేనమామ రమణమూర్తి దగ్గరకూర్చుని మాట్లాడుతున్నారు. ఆఫ్రికా అంతటా ఎన్నోచోట్ల గాంధీ విగ్రహాలు ఎలా ఉన్నాయో, గాంధీ అంటే ఆఫ్రికన్లకు ఎంత ఆరాధనాభావమో, గాంధీ సినిమా విడుదలై ఆఫ్రికాలో ఎంత సంచలనం సృష్టించిందో చెబుతున్నది హేమలత.

గాంధీ హత్యానంతరం వెంటనే స్పందిస్తూ ఐన్‌స్టీన్ పలికిన మాటలను కోట్ చేస్తున్నాడు రాజశేఖరం.

'నీకు రాజశేఖరమని పేరెందుకు పెట్టార్రా ?' అన్నాడు రమణమూర్తి.

'మా అమ్మకూ, నాన్నకూ శివుడంటే ఇష్టం. తాతయ్యకూడా అప్పుడు శివుడి పేరే పెట్టాలన్నాట!'

'రాజశేఖరమంటే శివుడా ?' అన్నది రమణమూర్తి కూతురు.

'అవునుకదా ! రాజు అంటే చంద్రుడు. చంద్రుణ్ణి తలపై ధరించినవాడు రాజశేఖరుడు. అంటే శివుడే!' అంటూ నవ్వాడు రాజశేఖరం.

ఎదురుగా టీ.వీలో సినిమా పాటలొస్తున్నాయి. క్షణానికో నేపథ్యం, క్షణానికో డ్రస్సు. దాదాపు నగ్నంగా నాయిక. ఆమెను ఆపాదమస్తకమూ ముఖ్యంగా నాభి ప్రాంతంలో నాలుకతో తడుముతున్న నాయకుడు...వెనక ఎగురుతూ కొందరు విచిత్ర వేషధారులు... ఎవరో పాడుతున్న అశ్లీలపు పాట... మేనమామ కూతుళ్లిద్దరూ కళ్లార్పకుండా చూస్తున్నారు.

హేమలత ఆనాటి దినపత్రిక తిరగవేస్తూ కూర్చుంది. రాష్ట్రంలో అయిదారు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరగబోతున్నాయి. వాటిని గురించి సమాచారం పేపరునిండా. సవాళ్లు, ప్రతిసవాళ్లు, నిందలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు...త్వం శుంఠ అంటే త్వం శుంఠ వగైరా విషయాలతో పేపరంతా రాజకీయ వాసన కొడుతున్నది. ఎక్కడా సాహిత్యం గురించి కానీ, సంస్కృతి గురించి గానీ మరే కళను గురించి గానీ, ఇతర పనికొచ్చే విషయం కానీ అక్షరమైనా లేదు. ఒక పేజీనిండా మాత్రం తయారీలో ఉన్న సినిమాలు, వాటిలో చిత్ర విచిత్ర విశేషాలు, తారల కబుర్లూ, రంగుల బొమ్మలూ పుష్కలంగా ఉన్నాయి.

కృష్ణాతీరంలో ఉన్న మహాపట్నం వెళ్లి ఒకరిద్దరు ముఖ్య బంధువులను చూడటం మాత్రం మిగిలి ఉంది.

బోట్స్వానాలో బయలుదేరేటప్పుడు తల్లి ఆ నగరాన్ని గురించి చెబుతూ, 'అది ఆంధ్రా వెనిస్ అనుకో ! పెద్ద కొండలు... మధ్యలో మహానది... మూడు అందమైన కాలువలు పట్నం మధ్యలో... ఎంత బాగుంటుందో! అక్కడి కొండమీద గొప్ప దేవత. గొప్ప మహిమగల తల్లి ! ఎక్కడెక్కడి నంచో యాత్రికులు వస్తూ ఉంటారు' అన్నది.

తాము ఇక్కడికి వచ్చి దిగిన ఊరు ఆంధ్రా పారిస్ అని ప్రసిద్ధి చెందిందట. అక్కడికి పదిమైళ్లు ఈ తాతగారి సంపన్నగ్రామం.

రైలు దిగి కారెక్కగానే ఆంధ్రా పారిస్ వైభవం తెలిసివచ్చింది. పారిస్ ఎట్లా ఉంటుందో తమకు తెలియదు గానీ, ఇట్లా మాత్రం ఉండి ఉండదు. ఆ రోడ్లు, ఆ అల్లరీ ఆగమూ, రోడ్ల పొడవునా పద్ధతీ పాడూ లేకుండా అడ్డదిడ్డంగా నడుస్తున్న జనమూ, సైకిళ్లూ, ఇతర వాహనాలు చేసే భయంకర విన్యాసాలు అన్నీ బీభత్సం అనిపించాయి. అయితే ఆ పారిస్ దాటి తమ గ్రామం రోడ్డెక్కగానే మాత్రం ప్రాణాలు లేచొచ్చాయి. కన్నుల పండువుగా ప్రకృతి ఆహ్లాదం కలిగించింది. అందాల పైరు పొలాలు, చక్కని రంగురంగుల ఆకాశం, రోడ్డు కటూ ఇటూ రకరకాల చెట్లూ... అంతా హాయిగా అనిపించింది.

ముసలాయన వ్యవహారాలన్నీ సర్దుకుని వచ్చి కూర్చుని పిల్లలను పలకరించాడు. హేమలత ఉన్నట్టుండి, 'తాతయ్యా ! అక్కడ గాంధీగారి బొమ్మ చూశాం వచ్చేటప్పుడు. అది బాగా పాడైపోయి ఘోరమైన దుస్థితిలో ఉంది. నువ్వు గాంధీగారిని చూసినవాడివి కదా! ఫ్రీడమ్ ఫైటర్‌వి కదా ! ఆ విగ్రహాన్ని బాగుచేయించకూడదూ ?' అని అడిగింది.

ముసలాయన నవ్వి, 'ఎందుకులే అమ్మా ! దాని సంగతి వదిలేశాం ! ఊళ్లో రెండుచోట్ల వేరే మహానాయకుడి విగ్రహాలు ఉన్నాయి. వాటిని వాళ్లు బాగా చూసుకుంటున్నారు. ఇక ఇప్పుడు మా పార్టీ నాయకుడి విగ్రహమే లేదీవూళ్లో. దాన్ని తయారుచేయించి పెట్టించేస్తున్నాం తొందరలోనే. పెద్ద కంచు విగ్రహం. అయిదు లక్షలవుతోంది. అయినా డబ్బుకు వెనకాడ్డంలేదులే ! మన తెలుగోళ్ల గౌరవం ప్రపంచకం అంతటా తెలియజేసి నోళ్లు మనకు అవసరంగానీ గాంధీగారి బొమ్మ ఇప్పుడెందుకు ? ఆ విగ్రహం వొచ్చే నెల్లోనే ఆయన్ని పిలిపించి ఆయనచేతనే...' అంటూ మాట దొరక్క ఆగిపోయాడు.

'ఆవిష్కరింపజేస్తారు...!' అని అందించాడురమణమూర్తి.

'ఆ...ఆ అంతే !' అన్నాడు ముసలాయన. హేమలత ముసలాయన్నే చూస్తూ కూర్చుంది. మనసులో ఒకదృశ్యం...గాంధీని చూసిన అదృష్టవంతుడైన తాతగారిని చూసిన మొదటి క్షణాలు, ఆయన స్నానం చేసి పట్టె నామాలు ధరించి శుచిగా ఇంటి వెనక పెరటిలో ఉన్న తులసి మొక్కముందు గుప్పెడు పంచదార పోస్తున్నాడు.

రమణమూర్తి చెప్పాడు 'రోజూ తాతయ్యా స్నానం చేసి పూజ చేసి ఇలా తులసిముందు పంచదార ఉంచడం మామూలు. అది చీమలకు ఆహారం !'

ఆ తర్వాత తాతగారు తమను చూసి 'ఇంతప్పుడు చూశాను వీణ్ణి... ఎదిగిపోయాడు!' అని మనవణ్ణీ, 'అసలిది పుట్టనే లేదప్పటికి !' అని మనుమరాలినీ చాలాసేపు వదల్లేదు.

అనాడు మధ్యాహ్నం హేమలత పెరట్లోకి వెళ్లి కొయ్యబారి నిలబడిపోయింది. తులసి పక్కన తాతగారుంచిన పంచదార చుట్టూ డజన్ల కొద్దీ నల్లచీమలు - పెద్దవి - మూగి ఉండి కదలకుండా అపురూపంగా దొరికిన ఆహారాన్ని అప్యాయంగా తీరిగ్గా ఆస్వాదిస్తున్నాయి. పదిగజాల దూరంలోనుంచి ఒక తొండ మాటిమాటికీ రావడం, నిశ్శబ్దంగా నాలుగైదు చీమలను నోట కరచుకుని చప్పరిస్తూ వెనక్కు వెళ్లడం.... ఇలా చాలాసేపు హేమలత చూస్తూ ఉండిపోయింది. తాతగారు అల్పప్రాణులని చీమలకు ఆహారం పెడితే, అవి అమాయకంగా తొండకు బలయిపోతున్నాయి. అనాడామె పసిమనసు వ్యాకులమైపోయింది.

ముసలాయన బాగా అర్థమవుతున్నాడు. రోజూ ఇంటికి రకరకాల వ్యక్తులు వచ్చిపోతున్నారు. ఉదయం వేళ పనివాళ్లు రావడం కొంచెం ఆలస్యం చేస్తే సరి, చండప్రచండంగా చెలరేగి కేకలు వేస్తాడు. తిట్లు, శాపనార్థాలు ! ఇవికాక, ఒక్కొక్కప్పుడు చేయి విసరడం కూడా కద్దు. అప్పుడు రమణమూర్తి జోక్యం చేసుకుని పరిస్థితి చేయిదాటిపోకుండా చూస్తూ ఉంటాడు.

'ఈ అలగా జనాన్ని అదుపులో ఉంచకపోతే నెత్తినెక్కుతారు !' అంటూ ఉంటాడు ముసలాయన.

గాంధీగారి చెప్పు చూడటానికి వచ్చేవాళ్ల సంఖ్య పెరిగితే ఒకాయన - 'వీళ్లగోల భరించలేకుండా ఉన్నాం ! దీనికి అర్థో, రూపాయో టిక్కెట్టు పెట్టేస్తే పోయేట్టుంది!' అన్నాడు పెద్దగా నవ్వుతూ.

ముసలాయన కూడా నవ్వి ఊరుకున్నాడు - 'దానికి టిక్కెట్టేమిటి పోదూ !' అని మాత్రం అన్నాడు.

ఉదయం అన్నాచెల్లెళ్లిద్దరూ మేనమామతో కలిసి కారులో బయలుదేరారు. ఊరి బయటకు రాగానే డ్రాయింగ్ మాస్టారు ఎదురైతే అయన్నుకూడా ఎక్కించుకుని ప్రయాణం సాగించారు. రమణమూర్తి డ్రాయింగ్ మాస్టారు చిరకాల మిత్రులు కావడంచేత వివిధ విషయాల మీద సంభాషణ కొనసాగింది.

దాదాపు నలభై మైళ్ల ప్రయాణం. అసలే అన్నపూర్ణగా పేరొందిన భూమి. అంతటా పచ్చగా చక్షుః ప్రీతి చేస్తూ చెట్లు.. దగ్గరదగ్గర పల్లెలు... ఊళ్లు మాత్రం ఎన్నికల రొదతో హోరెత్తిపోతున్నాయి. ఊరు దాటితే అంతా ప్రశాంతమైన మనోహరమైన ప్రకృతి.

రమణమూర్తి 'ఈ ఎన్నికలకోసం రెండు పక్షాల వాళ్లూ సర్వశక్తులూ ధారపోస్తున్నారు !' అన్నాడు.

'సర్వశక్తులూ అంటే ?' అని అడిగాడు రాజశేఖరం.

'అంటేనా ? ముందు డబ్బు. మంచినీళ్లలా డబ్బు కుమ్మరిస్తున్నారు. ఆ తర్వాత మందు !' 'ముందు అంటే' అన్నది హేమలత.

'అంటే లిక్కర్ అన్నమాట ! ఔషధం కాదు. తాగినవాడు తాగబోయించినవాడికి విశ్వాసపాత్రుడై, నమ్మదగ్గవాడై ఉంటాడు. మోసం చెయ్యడు. డబ్బు తీసుకుని దగా చెయ్యవచ్చునేమో కానీ మందు తాగి మాత్రం దగా చెయ్యడు. ఎలక్షన్ అంటే చాలు

లిక్కర్ ఏరులై పారుతుంది. ఎవరికెక్కడ బలం ఉంటే వారక్కడ ఎదుటివారిని అణగదొక్కేస్తారు. మధ్యలో మామూలు ఓటర్లు భయభ్రాంతులైపోతారు. ఇదీ ఇటీవలి పరిణామం. ఇంతకుముందు అరవై డెబ్బై దశకాల్లో ఇంత అన్యాయం లేదు. ఉదాహరణకు మన ఊరే తీసుకో ! తాతయ్యకెదురు లేదక్కడ. పైనుంచి డబ్బుతో నిండిన సూట్‌కేసులొస్తాయి. వీళ్లు చేసే హడావుడికి ఎదుటివాళ్లు గజగజలాడిపోతారు. ఇక పోలింగ్ రోజున ఏ గొడవా ఉండదు. అంతా ముందే సెటిలయిపోతుంది. చెదురు మదురు సంఘటనలు తప్ప అంతా ప్రశాంతంగా జరిగిపోతుంది. ప్రాణాలమీద ఆశ ఉన్నవాడెవడూ ఓటు వెయ్యడానికి రాడు, వొస్తే తిరిగి వెళ్లడు. కొన్ని బలహీనవర్గాల వారికి ఆ రోజు ఉదయం నుంచి మందు, పలావులు ఏర్పాటై ఉంటాయి. వాళ్లు ఉదయం నుంచి పోలింగ్ పూర్తి అయ్యేవరకూ కొన్ని ఎంపికైన ఆవరణలలో కడుపునిండా తాగి, తిని, తాగి, తిని, తాగి, తిని, తిని త్రేన్చి నిద్రపోతారు. బయటికి రారు. ఒకవేళ ఎదుటివాళ్లు తెగించి ముందు కొచ్చారనుకో, ఒక అప్పుడు పై నుంచి వచ్చిన చేతిబాంబు నిపుణులు విజృంభిస్తారు. బీభత్సం సృష్టిస్తారు. మొత్తానికి సాయంకాలానికి మాత్రం అంతా సజావుగా జరిగిపోతుంది. బాలెట్ పెట్టెలు భద్రంగా ఓట్లతో నిండిపోయి ఉంటాయి. పరిస్థితి మాత్రం అదుపులోనే ఉంటుందెప్పటికీ !'

మేనమామ ధోరణి అన్నాచెల్లెళ్లకు ఆశ్చర్యం కలిగించింది.

వాళ్లు విన్నదాన్ని బట్టి, చదివినదాన్ని బట్టి ఇక్కడ బహుశా ప్రపంచంలో ఎక్కడా లేనంత గొప్పగా ప్రజాస్వామ్యం, ఎన్నికల పద్ధతి అమల్లో ఉంది. ఇక్కడ సామాన్య మానవుడి చేతిలో ఓటు అనే అద్భుతమైన ఆయుధం ఉంది. దానికున్న శక్తి ఏ అణుబాంబులోనూ లేదు. అది ప్రభుత్వాలను నిలబెడుతుంది. అదే మళ్లీ ప్రభుత్వాలను కూలగొడుతుంది. కానీ ఆచరణలో జరుగుతున్నదేమిటి ? దీనికి గాంధీమతానికి చెందిన తమ తాతగారిలాంటివారే కారకులవుతున్నారా ?

'ఈ దేశం ఎంత గొప్పది !' అనుకుంటున్నది హేమలత. ఇక్కడ ఎన్ని పుణ్య నదులు! ఎన్ని ఎడారులు .... ఎంత దాక్షిణ్యం... ఎంత క్రౌర్యం.... ఎంతజ్ఞానం.... ఎంత అజ్ఞానం... ఎన్ని నీళ్లు... ఎంత నీళ్ల కరవు... ఎన్నికులాలెన్ని మతాలు, ఎన్నిగుడులెన్ని గోపురాలెన్ని క్షేత్రాలు... ఎన్ని పూజా గృహాలెన్ని పూజా విధానాలు... ఎంత ఐశ్వర్యం... ఎంత ఆకలి ! ఎందరెందరు మతాధిపతులెన్ని ఆరాధనా పద్ధతులు... ఎన్ని భాషలు.. ఎంత నిశ్శబ్దం... ఎంత వైవిధ్యం... మళ్లీ ఎంత ఏకత్వం ! ఆలోచిస్తూ ఉంటే ఆశ్చర్యమనిపించింది. ఒకప్పటి చప్పన్నారు దేశాలు, మరొకప్పటి అయిదువందలపై చిలుకు చిన్నా పెద్దా రాజ్యాలన్నీ కలిసి అప్పటి వారి పుణ్యమా అని ఏక ఖండమై భాసిల్లింది ఈ భూమి !

డ్రాయింగ్ మాస్టారు గొప్ప ఆశావాది. 'ఈ దేశం తీరే అంత ! ఎంత శాంతి ఉందో, అంత అశాంతి ఉంది. ఎంత సంతృప్తి ఉందో అంత అసంతృప్తి ఉంది. ఎంత జీవకారుణ్యం ఉదో, అంత కర్కశత్వమూ ఉంది. ఎన్ని రంగుల చర్మాలున్నాయో అంత ఐకమత్యమూ ఉంది. ఈ వ్యవస్థకు యాభై ఏళ్ల వయసు వచ్చింది. ఇక ఇప్పుడే ప్రమాదమూ రాదు. బాలారిష్టాలన్నీ దాటావనే అనుకోవచ్చు. వ్యక్తుల వల్ల లోలోపల వమరికి, అమానుషత్వమూ, కల్తీ, అవినీతి, లంచగొండితనం, బాంబుల సంస్కృతీ అన్నీ

ఉంటాయి. ఇవన్నీ పై పొరలు.... సముద్రంలో పైపై రొదలాగా ! లోపల అంతా ప్రశాంతతే !'

పెద్ద బారేజి మీదుగా కారు పోతున్నది. చుట్టూ అద్భుతమైన దృశ్యం. పరవళ్లు తొక్కుతూ వచ్చి ప్రశాంతంగా ఆగి బిగిసిన నీటి ప్రవాహం. రెండో పక్క విపరీత వేగంతో దూకుతున్న జలధార. దూరంగా రైలు వంతెన... ఎదురుగా కొండ... కొండమీద నగరాధి దేవత... అంతా నయనపర్వంగా ఉంది.

కారు ఊళ్లో రెండు పేటలకు వెళ్లింది.

ఒకచోట ఈ పిల్లల మరో మేనమామ అంటే తాతగారి మరో కొడుకు పెద్ద ఉద్యోగంలో ఉన్నవాడు... పెద్ద ఇల్లు. జీతం కాక పైన బాగా సంపాయించే బాపతు. ఎంసెట్‌తో సతమతమవుతున్న ఇద్దరు ఆడపిల్లలు... పెద్ద పెద్ద కంఠస్వరాలు... ఇల్లంతా శుభ్రంగా ఉంది.

కానీ ఆ వీథి అంతా మురికికూపంలా ఉంది. నగరంలో ముఖ్య వీథులు చూస్తే అద్భుతం అనిపించిందా, ఈ వీథి చూస్తే వెగటు కలిగింది. అంతటా మురికి, దుర్గంధం.! వీథి పక్క చెత్త డబ్బాలలో మురికిలో దేనికోసమో వెతుకుతున్న పిల్లలు... అంతా ఘోరంగా ఉంది.

రెండోచోటు ఒక బంధువు. ఆయన కాలేజీ లెక్చరరు. వీళ్లు వెళ్లగానే ముందు హాల్లో ఉన్న యాభై పై చిలుకు ట్యూషన్ విద్యార్థులను పంపించి లోపలికి వచ్చాడు. ఆ వీధి పరిస్థితీ మొదటిదానికిడిటోనే. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రతి ఇంట్లో పిల్లలకు జ్వరాలట! చిన్న చిన్న వైద్యుల దగ్గర కూడా పిల్లల్ని ఎత్తుకుని జనం గుమిగూడి ఉన్నారు.

తిరుగు ప్రయాణంలో రెండు మూడు అడ్డంకులు అధిగమించి ఊరికి చేరుకునే సరికి అర్ధరాత్రి అయింది.

ఎలక్షన్ ముందు రోజే ఉదయం పోలింగ్ సిబ్బంది నలుగురు, ఒక పోలీసు, పోలింగ్ సామగ్రితో దిగారు. వారిని దింపి ఒక లారీ వెళ్లిపోయింది. వారిని తాతగారు సాదరంగా ఆహ్వానించారు. చక్కటి ఆతిథ్యం ఇచ్చారు.

'మీకేం ఫర్వాలేదు, మేము చూసుకుంటాం అంతా !' అన్నారు.

ఈ పల్లెలో ఎంత ఇబ్బంది పడవలసి వస్తుందో అని భయపడుతూ వచ్చిన ఆ నలుగురూ ఇక్కడి ఒబెరాయ్ షెరిటన్ లెవెల్ ధోరణి చూసి ఆనందంతో తలకిందులైపోయారు. వసతిగృహం, దిండ్లు, పరుపులు దగ్గర్నుంచి ఏది కావాలంటే అది కాళ్ల దగ్గరికి వచ్చింది. వాళ్లు చక్కగా తాగి, సుష్టుగా తిని పడుకున్నారు.

మరునాడు పోలింగ్.

జరగవలసిన విధంగానే జరిగింది.

ప్రాణాలమీద ఆశ ఉన్నవాడెవడూ ఓటెయ్యడానికి రాలేదు. క్యూలు లేవు. ఉన్నా చూపులకే డ్రాయింగ్ మాస్టారూ, తాతగారి అబ్బాయి రమణమూర్తిలాంటి కొందరి విషయంలో మాత్రం ముభావంగా ఊరుకున్నారు. విపక్షంవారి ఏజెంట్ తనకు రావలసిన పైకం తీసుకుని ఉదయమే వెళ్లిపోయాడు. పత్తాలేదు. అప్పుడప్పుడు ఒక్కొక్కడెవరో